వెదలపైనే ఆసక్తి

- తగ్గుతున్న వరి నాట్లు
- దమ్ము పెట్టడానికి రైతుల వెనకడుగు
- పాతపట్నం నియోజకవర్గంలో 56,900 ఎకరాల్లో వరి వెదలు



జోడూరు వద్ద వరి వెద పొలాలు

పాతపట్నం నియోజకవర్గంలో వ్యవసాయ భూమి, వెదలు వేసిన భూమి వివరాలు (ఎకరాల్లో)

మండలం	వ్యవసాయ భూమి	వెదలు వేసినది
పాతపట్నం	17,800	14,200
మెళియాపుట్టి	16,100	11,300
కొత్తూరు	16,900	11,700
ఎల్.ఎన్.పేట	11,200	9,100
హిరమండలం	14,000	10,600

మెళియాపుట్టి:

విపత్తులను తట్టుకుని, పంట చేతికి వచ్చే దాకా నమ్మకంలేని వ్యవసాయంపై రైతన్న మక్కువను తగ్గించుకుంటున్నాడు. నారుపెంచి, దమ్ము పట్టి, నాటువేసే పద్ధతి కూడా రానురానూ తగ్గుతుంది. వాతావరణ పరిస్థితులకు భయపడి వరి వెదలపైనే రైతులు అధికంగా ఆధారపడుతున్నారు. వ్యవసాయ పద్ధతులు మారుతున్న తరుణంలో రైతులు పెట్టుబడులకు వెనకాడుతున్నారు. దమ్ములో గట్లు వేయడం, నారు వేయడం, మళ్లీ నారు తీయడం, దమ్ము పట్టడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ఎకరాకు సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. వెదలు వేయడంతో సుమారు రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం ఈ పద్ధతి పైనే 80 శాతం మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేసుకుంటే 76,000 ఎకరాల సాగు భూమి ఉంటే.. కేవలం 19,100 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేస్తున్నారు. 56,900 ఎకరాల్లో వెదలు వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

కూలీలు దొరకడం కష్టంగా ఉంది



నాకు రెండెకరాల భూమి ఉంది. గతంలో లాగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడంలేదు. అత్యధిక కూలి డిమాండ్ చేస్తున్నారు. వర్షాధార భూములు కావడంతో దమ్ము పట్టడానికి ధైర్యం చేయలేకపోతున్నాం. జూలై నెల వచ్చినా సరైన వర్షాలు లేవు. దమ్ముపడితే ఇబ్బందులు తప్పవనే ఆలోచనతోనే వెద వేసుకున్నాం. ఏం జరిగినా దేవుడిపైనే భారం.

– జన్ని భాస్కరరావు, గిరిజన రైతు, నేలబొంతు, మెళియాపుట్టి మండలం

వ్యవసాయం చాలా కష్టం



వ్యవసాయం చేయాలంటేనే భయం వేస్తుంది. అన్ని కష్టాలను దాటి పంటలు పండించి, పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు, ఇతరత్రా సమస్యలతో పెట్టుబడులు కూడా రాని రోజులు చూశాం. శ్రమను తగ్గించి, మెలకువలు పాటిస్తూ వ్యవసాయం చేసుకుంటున్నాం. అందులో భాగంగానే వెదలు వేయడానికి మొగ్గు చూపుతున్నాం.

– గొల్ల పోలమ్మ, గిరిజన రైతు, నేలబొంతు, మెళియాపుట్టి మండలం

సూచనలు ఇస్తున్నాం..



వరిలో వెదల వలన ఉపయోగాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అడపాదడపా కురిసిన వర్షాల వల్ల వెదలు వేసుకున్నా చక్కగా మొలకెత్తుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో సైతం పంట ఎండిపోదు. సమయం, ఖర్చు ఆదా అవుతుంది. పంటచేతికొచ్చే సమయంలో వర్షాలు పడినా పైరు నేలవాలిపోకుండా ఉంటుంది. అధిక శాతం రైతులు వెదలు వేయడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం 30 శాతం మంది రైతులు మాత్రమే వరినాట్లు వేయడానికి సుముఖంగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా సలహాలు సూచనలు అందిస్తున్నాం.

– ఎం.రామారావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, పలాస

కూటమిది నయవంచన పాలన



ఆమదాలవలస: తిమ్మాపురంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి నయవంచన పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలస మున్సిపాలిటీ ఒకటో వార్డులోని తిమ్మాపురం, 22వ వార్డులోని లక్ష్మిడిపేట గ్రామాల్లో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ నాయకులతో కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడారు. ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. సంక్షేమ పథకాలు ప్రజలు అందడం లేదన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరిస్తూ.. అక్రమార్జన కోసం ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, నాయకులు సంపతిరావు రామారావు, మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవిరావు, ముఖ్య నాయకులు దుంప శ్యామలరావు, మామిడి రమేష్, ఎన్ని గోవిందరావు, దుంపల శ్రీనివాసరావు, మున్సిపల్ క్యాడర్ పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి డిమాండ్ చేశారు. మండలంలోని కోబగాం, నడగాం పంచాయతీల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, ఉకలాపు రవి, యాబాజి రమేష్, బగ్గు రమణయ్య, కనపల శేఖరరావు, బగ్గు సతీష్, నేతింటి రాజేశ్వరరావు, బుద్దల రాజశేఖరరావు, సతివాడ రామినాయుడు, చింతల సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: కోబగాంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జలుమూరులో..

జలుమూరు: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. బుధవారం బొడ్డపాడు, కొండపోలవలస, నగిరికటకం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, ధర్మాన జగన్, అంపోలు తిరుపతిరావు, పి.విజయ్, బి.వి.రమణ. కె.హరి ప్రసాద్, పంగ పాపరావు, పంచిరెడ్డి రాజారావు, వెలమల దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



పోలాకి: బెలమరలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పోలాకిలో..

పోలాకి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఇప్పటి కూటమి ప్రభుత్వానికి తేడాలను ప్రజలే గమనించాలని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండలంలోని మగతపాడు, డీఎల్‌పురం, బెలమరపాలవలస పంచాయతీల్లో బుధవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్రవుపేట, మగతపాడు, బెలమర గ్రామాల్లో కూటమి నాయకుల హామీలను, అమలు తీరును ప్రజలకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, నాయకులు చింతు రాఘవరావు, చింతాడ ఉమామహేశ్వరరావు, పైల మల్లేసు, కూన ఢిల్లేశ్వరరావు, తమ్మినేని వెంకటరత్నం, గురువు బాలకృష్ణ, చింతాడ భీమారావు, బెండి శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, పార్టీ నాయకులు సుంకరి రాంబాబు, కై బాడ వాణి, గేదెల నాగేశ్వరరావు, కణితి సత్తిబాబు, చింతు రామకృష్ణ, సాలిన నగేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రవిబాబు మృతికి సంతాపం

పాతపట్నం: మండల కేంద్రంలోని కాపు వీధికి చెందిన లింగాల జనార్దనరావు కుమారుడు రవిబాబు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రవిబాబు ఆత్మకు శాంతి కలగాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

విచారణ..



లబ్ధిదారులను విచారిస్తున్న పీఓ గీత

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు అంగన్‌వాడీ కేంద్రంపై గత కొన్ని రోజులుగా వస్తున్న ఆరోపణలపై బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత బుధవారం విచారణ నిర్వహించారు. 15 మంది లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరుకులు సక్రమంగా అందుతున్నాయని, కార్యకర్త జ్యోతి పిల్లలకు సక్రమంగా బోధన చేస్తున్నారని లబ్ధిదారులు తెలిపినట్లు పీఓ వెల్లడించారు. ఈ కేంద్రంపై వచ్చిన ఆరోపణలపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహించినట్లు తెలిపారు. విచారణలో సూపర్‌వైజర్ అమ్మన్నమ్మ పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ



విద్యార్థుల తల్లిదండ్రులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎంఈఓ దాలినాయుడు

నరసన్నపేట: మండలంలోని నలుగురు దివ్యాంగ విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ ద్వారా మంజూరైన వీల్‌చైర్లను బుధవారం ఎంఈఓ దాలినాయుడు పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని తల్లిదండ్రలకు సూచించారు. జమ్ము, నరసన్నపేట పంచాయతీల్లో ఉన్న ఎం.హరిణి శ్రీ, బి.వర్షిత, వై.రోహిత్, ఎస్.నిషిత సాయికి వీల్‌చైర్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

జీఓ 3ను పునరుద్ధరించాలి



వైస్ ఎంపీపీ ఆదినాయుడు

మెళియాపుట్టి: జీఓ నంబర్ 3ను పునరుద్ధరణ చేయాలని, తద్వారా గిరిజనులకు శత శాతం రిజర్వేషన్ లభిస్తుందని వైస్ ఎంపీపీ ఆదినాయుడు అన్నారు. బుధవారం పరశురాంపురం గ్రామంలో మాట్లాడారు. జీఓ నంబర్ 3 వలన గిరిజన యువతకు భవిష్యత్ ఉంటుందని, ఉద్యోగాలు, హక్కుల సాధనకు సహాయకారిగా ఉంటుందన్నారు. ఈ జీఓను ప్రభుత్వం వెంటనే పునరుద్ధణ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు అండగా ఉండేలా ప్రభుత్వాల చర్యలు ఉండాలని, గిరిజనులను ఇబ్బందులకు గురయ్యేలా చేయవద్దన్నారు. గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

పాతపట్నం: పాతపట్నంలోని ప్రహరాజపాలెంలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ నాయకురాలు మల్లిపురం దేవి కోరారు. బుధవారం పాఠశాల వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ.. పాఠశాలలు పునః ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా జీతం ఇవ్వలేదన్నారు. కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఎం.ఈశ్వరమ్మ, జె.దానమ్మ, ఎల్.లలిత పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బూర్జ: మండలంలోని వైకుంఠపురం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ హాజరవుతారన్నారు. సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, నియోజకవర్గ, జిల్లా స్థాయి వివిధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి



పూజారి హరిప్రసన్న

పొందూరు: ఈ ఏడాది మే నెలలో జరిగిన బదిలీల్లో వెబ్ ఆధారిత కౌన్సిలింగ్‌లో కొత్త పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులు రిలీవ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పొందూరులో మాట్లాడారు. బదిలీల్లో వారు కోరుకున్న పాఠశాలలకు బదిలీ అయినప్పటికీ రిలీవర్ లేరనే నెపంతో వారిని రిలీవ్ చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అర్హత కలిగిన ఎంటీఎస్ ఉపాధ్యాయులను బదిలీ అయినా కూడా.. రిలీవ్‌కాని ఉపాధ్యాయుల స్థానంలో డిప్యుటేషన్ వేయాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. పాఠశాలల పునర్వవస్థీకరణలో భాగంగా కొత్తగా మంజూరైన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమితులైన ఉపాధ్యాలకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బకాయిలు విడుదల చేయకుండా, పీఆర్సీ, ఐఆర్, డీఏలు మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.

రూ.10 వేల విరాళం

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని చల్లవానిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.నిర్మలాదేవి అన్నారు. బుధవారం చల్లవానిపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మెండ గణపతిరావు పాఠశాల అభివృద్ధికి రూ.పది వేలు విరాళంగా అందించారు. ఆయనను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పరామర్శ..



చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: మండలంలోని అల్లాడపేటకు చెందిన గురివిల్లి చంద్రయ్య ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, గ్రీవెన్స్ అధ్యక్షుడు ధర్మాన జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు కల్యాణం శ్రీనివాసరావు, వెలమల అసిరినాయుడు, వెలమల రామకృష్ణ, చింతు గణపతిరావు, తదితరులు ఉన్నారు.

ఎరువుల షాపుల తనిఖీ



ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

నరసన్నపేట: మండల కేంద్రంలో ఉన్న రెండు ఎరువుల షాపులను శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. నాగార్జున ఫెర్టిలైజర్ షాపులో రికార్డులు అప్‌డేట్‌గా లేకపోవడంతో తగిన సూచనలు చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన పురుగు మందులు గిడ్డంగుల్లో ఉండటాన్ని గమనించి మందలించారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల షాపుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయాధికారి త్రినాథరావు, నరసన్నపేట తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఏఓ సూర్యకుమారి, డీటీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అరకొర ఎరువులతో ఇక్కట్లు

బూర్జ:

మండలంలోని రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు సరఫరా చేయాలని మామిడివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతానికి ఎకరాకు ఒక్క బస్తా అయినా కనీసం రైతులకు అందజేయాలని, ఎన్ని ఎకరాలు ఉన్నా.. రెండు బస్తాలు ఇస్తే ఎలా సరిపోతుందన్నారు. రైతులు ప్రయివేటు వర్తకుల వద్ద కొనుగోలు చేయాలంటే ఒక బస్తా కనీసం రూ.400 అవుతుందన్నారు. అధికారులు స్పందించి రైతులకు సరిపడే అన్ని ఎరువులు సరఫరా చేయాలన్నారు.

ఎరువులు అందడం లేదు..

బూర్జ: రైతు సేవా కేంద్రాలు చుట్టూ రైతులను తిప్పుతున్నారని, ఎరువులు మాత్రం అందడం లేదని తమ్మినాయుడుపేట సర్పంచ్ మూడడ్ల సుదీప్త అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ్మినాయుడుపేట పంచాయతీలో తమ్మినాయుడుపేట, కటకమయ్యపేట గ్రామాల రైతులకు రొట్టవలస గ్రామ రైతు సేవా కేంద్రంలో ఎరువులు ఇస్తామని తిప్పుతున్నారని, ఎరువులు మాత్రం అందజేయడం లేదన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకూ ఒక్క యూరియా బస్తా కూడా అందలేదన్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఎరువులు సరఫరా చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 24వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, కొత్త విద్యుత్ లైన్ వేయడం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం, కొత్తచంగుడి, చంగుడి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సారవకోట మండలంలో రేపు..

సారవకోట: ఈ నెల 25వ తేదీన కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి ఈఈ నరసింహ కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సారవకోట మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు.

నరసన్నపేటలో భారీ వర్షం



నరసన్నపేటలో కురుస్తున్న వర్షం

నరసన్నపేట: మండలంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం పడింది. పొలాల్లో నీరు చేరింది. ఇప్పటికే 70 శాతం విస్తీర్ణంలో రైతులు వరి వెదలు వేశారు. పలుచోట్ల ఉభాలు వేస్తున్నారు. నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లోని వీధుల్లో కాలువలను తలపించేలా వరదనీరు ప్రవహించింది. నరసన్నపేట బజారు వీధిలో అడుగుకు పైగా నీరు చేరింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. నడగాం, చిక్కాలవలస, కానుకుర్తివానిపేట రైల్వే అండర్ పాసేజ్ వద్ద నీరు అధికంగా చేరింది. ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు.

విద్యార్థుల రక్షణ అందరి బాధ్యత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

నరసన్నపేట: విద్యార్థుల రక్షణ మన అందరి బాధ్యత అని, ప్రతీ స్కూల్, కాలేజీ, హాస్టల్‌లో విద్యార్థులు క్షేమంగా ఉండాలని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక స్వామి బాబు–వజ్రమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోరాడ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం సాయంత్రం నరసన్నపేటలో మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న బాలికలకు సేఫ్ టచ్, సేఫ్టీ రూల్స్, పర్సనల్ సేఫ్టీ ఎడ్యుకేషన్ (పీఎస్ఈ) అనే మాడ్యూల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీకాకుళంలో ఆవిష్కరించారన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థులకు ఎస్‌పీసీటీ, కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్టుతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల భద్రత పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తగిన సూచనలు ఇవ్వాలన్నారు. వారిని గమనిస్తూ ఉండాలని, ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో పడాల చారిటబుల్ ట్రస్టు సీఈఓ సూర్యప్రసాద్, డీఈఓ తిరుమల చైతన్య, ఎస్‌పీసీటీ ప్రతినిధులు కరుణ, శ్రావణి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



సారవకోట మండలంలోని కేశవలస గ్రామంలో కల్వర్టు మూసుకుపోయింది. దీంతో అలుదు నుంచి పాకివలస వెళ్లే రహదారికి పక్కనే వర్షం, మురుగునీరు నిల్వ ఉంటుంది. ఏ మాత్రం వర్షం కురిసినా కొండ పైనుంచి వచ్చిన వరదనీరు రోడ్డు పక్కనే నిలిచిపోతుంది. గ్రామంలోని మురుగు నీటితో కలిసి రోడ్డుపై ప్రవహిస్తుంది. రోడ్డు కూడా పూర్తిగా శిథిలమైపోవడంతో ఆ గోతుల్లో మురుగునీరు నిల్వ ఉంటుంది. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

– సారవకోట

బెలమాంలో జ్వరాల విజృంభణ

- ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు



బెలమాంలో జ్వరంతో బాధపడుతున్న యువకుడు

ఆమదాలవలస: మండలంలోని బెలమాం గ్రామంలో నాలుగు రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో మగ్గుతున్నారని గ్రామస్తులు బుధవారం తెలిపారు. తొలిత జ్వరం వస్తోందని, రెండు రోజుల తరువాత కాళ్లు, చేతులకు పొంగులు వచ్చి రోగులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. తమ గ్రామం దూసి పీహెచ్‌సీ పరిధిలో ఉందన్నారు. వైద్య సేవలు సక్రమంగా అందించడం లేదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. గ్రామమంతా విషజ్వరాలున్నా.. వైద్యసేవలు అందించకపోవడంపై పలువురు మండిపడుతున్నారు. ఈ విషయమై దూసి పీహెచ్‌సీ వైద్యురాలు మాధురిని వివరణ కోరగా.. రెండు రోజుల క్రితం ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామానికి వెళ్లి పలువురి వద్ద బ్లడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు జరిపామన్నారు. చాలా మందికి పరీక్షలు నిర్వహిస్తే.. నలుగురికి మాత్రమే విష జ్వరాలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. ప్రస్తుతం వైద్య సిబ్బందిని గ్రామంలోనే అందుబాటులో ఉంచామని తెలిపారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) ఆవరణలో రూ.2.55 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంఈఓ సి.హెచ్.తిరుమలరావు, ప్రత్యేకాధికారి సంతోషి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

సరుబుజ్జిలి: ఎరువులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ, మాజీ సర్పంచ్ బొంగు వెంకటరత్నం నాయుడు అన్నారు. రావివలస రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు గౌతమి, భగవత్ పాల్గొన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి స్వచ్ఛతపై టీమ్ సభ్యులు క్లోరినేషన్ టెస్ట్ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, సెక్రటరీ ఆశ, ఆశ వర్కర్ భవానీ పాల్గొన్నారు.